క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర ఏడీఏ విజయచంద్ర మాట్లాడుతూ.. సేంద్రీయ వ్యవసాయం చేయడం వలన భూమి జీవశక్తి పెరుగుతుందని, నీటి నిల్వలు మట్టి నాణ్యత మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మానస, ఏఈఓలు కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

'నవభారత్' విద్యార్థులకు బంగారు పతకాలు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో విద్యార్థులు

సత్తుపల్లి: వరంగల్‌లో సోమవారం జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో సత్తుపల్లిలోని నవభారత్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఏడు బంగారు పతకాలు స్వీకరించారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ గాదె నర్సింహారెడ్డి, కరస్పాండెంట్ జీ.వీ.లింగారెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

నూతనకల్ వాసికి..



కళ్యాణపు మధు

తల్లాడ: మండలంలోని నూతనకల్‌కు చెందిన కళ్యాణపు మధు కేయూ స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా రెండు బంగారు పతకాలు స్వీకరించాడు. 2016లో కేయూ లా కళాశాలలో ఎల్ఎల్ఎం పూర్తి చేసిన ఆయన రెండు పతకాలు సాధించాడు. ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీలో పీజీ(టూరిజం) చేస్తున్న మధును ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి

బోనకల్: బీఎల్‌ఓలు ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మద్దెల రమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల విధులపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో బూత్‌స్థాయి అధికారులదే కీలకపాత్ర అన్నారు. ఎన్నికల ఉప తహసీల్దార్ డేవిడ్ కరుణాకర్, ఆర్ఐలు నవీన్‌కుమార్, మైథిలీ, బొడ్డుపల్లి ఉపేందర్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు

తల్లాడ: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులనుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి గాజుల శశికిరణ్ అన్నారు. సోమవారం తల్లాడలో నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఖమ్మంలో జరిగే పీడీఎస్‌యూ జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలన్నారు. నాయకులు అన్వేష్, నాగేష్, ప్రకాష్, నరేంద్ర పాల్గొన్నారు.

అండర్‌బ్రిడ్జి రహదారి మూసివేత

మధిర: పట్టణంలోని అండర్‌బ్రిడ్జి రహదారిని మూసివేశారు. మధిర రైల్వే అండర్‌గ్రౌండ్ మోరీ వద్ద నూతనంగా కల్వర్ట్ నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ రాకపోకలను నిలిపివేశారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు కంపాక్స్‌బాక్స్‌లు వితరణ

కల్లూరు: కల్లూరు అంబేడ్కర్‌నగర్ పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఉబ్బన నాగరాజు చిన్న కుమార్తె, అల్లుడు హర్షిత, మహేంద్రబాబుల కుమారుడు నిశ్చల్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు కంపాక్స్ బాక్సులు అందించారు. హెచ్ఎం రామానుజాచార్యులు, రఘు, లావణ్య, షబానాబేగం, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ తల్లాడ మండల కార్యదర్శిగా రమేష్

తల్లాడ: సీపీఐ తల్లాడ మండల కార్యదర్శిగా ఓర్సు రమేష్‌ను ఎన్నుకున్నారు. సీపీఐ మండల మహాసభలో రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సోమవారం సీపీఐ మండల కమిటీ పేర్కొంది. రమేష్‌తో పాటు మరో 15మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పెండిగ్ వేతనాలు చెల్లించాలి

కొణిజర్ల: పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం జీపీ కార్మికులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావుకు వినతిపత్రం ఇచ్చారు. పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేష్, నారాయణ, సత్యం, బాబూరావు, దేవేందర్ పాల్గొన్నారు.



అంతా 'క్యూఆర్' మయం

- పట్టణం నుంచి పల్లెల వరకు వ్యాపించిన క్యూ ఆర్ కోడ్
- లావాదేవీలపై వ్యాపారస్తుల అవగాహన
- నగదు బదిలీ కోసం యాప్‌ల వినియోగం



పండ్ల దుకాణంలో క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బు చెల్లిస్తున్న వినియోగదారుడు

వైరారూరల్: గత ఆరేళ్ల కిందట పెద్ద నోట్లు రద్దు చేసిన కేంద్రం ఆర్థిక సంస్కరణలో భాగంగా నగదు రహిత లావాదేవీల మీద దృష్టి సారించింది. దాంతో బ్యాంకర్లు గ్రామస్థాయి నుండి క్షేత్రస్థాయిలో నగదు రహిత లావాదేవీల మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రారంభ దశలో ప్రజలు లావాదేవీలు చేసేందుకు ఇబ్బందులు పడినప్పటికీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో నగదు రహిత లావాదేవీలకు అలవాటు పడినారు. ఏ దుకాణానికి వెళ్లినా క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండడంతో వినియోగదారులు చేతిలో చిల్లి గవ్వలేకపోయిన తమ వద్ద స్మార్ట్ ఫోన్‌తో ఆర్థిక లావాదేవీలు జరుపుతున్నారు.

యాప్స్‌లో ఉపయోగాలు..

- నగదు కోసం బ్యాంకుల్లో గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండకుండా యాప్‌ల ద్వారా సులువైన పద్ధతిలో నగదు బదిలీ చేసుకోవచ్చు.
- యాప్‌లలో మొబైల్, డీటీహెచ్ రీచార్జ్, ఎల్ఐసీ, విద్యుత్ బిల్లులు, లోన్ ఈఎంఐలను చెల్లించవచ్చు.
- బస్సు, రైల్వే, విమాన టికెట్లతో పాటు ప్రైవేటు బస్సుల బుక్ చేసుకోవచ్చు.
- యాప్‌ల్లో క్యూఆర్ కోడ్‌ల ద్వారా రోజువారి బదిలీలకు అనుగుణంగా యాప్ నిర్వాహకులు లోన్ ఆఫర్లను అందిస్తున్నారు.

క్యూఆర్ కోడ్‌తో నగదు లావాదేవీలు..

ఒకప్పుడు అందరు ఎక్కడికి వెళ్లిన సరిపడా డబ్బులు తీసుకెళ్లేవాడు. ఇంకా అవసరమైతే బ్యాంకుల్లోనో, ఏటీఎం సెంటర్లలోనో నగదు విత్‌డ్రా చేసుకోని వినియోగించుకునేవాడు, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా స్మార్ట్‌ఫోన్లు, నగదు బదిలీల కోసం యాప్‌లు అందుబాటులోకి రావడం, నగదు రహిత లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్‌లు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. దీంతో చిన్నపాటి తోపుడు బండ్ల వద్ద నుంచి పెద్ద పెద్ద వ్యాపారస్తులు, కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండడడంతో రోజుకు రూపాయి నుంచి రూ.లక్ష వరకు యాప్‌ల ద్వారా నగదు రహిత ఆర్థిక లావాదేవీలు చేసుకుంటున్నారు.

వివిధ యాప్‌లు..

ఆన్‌లైన్ ద్వారా నగదు రహిత లావాదేవీలు చేసేందుకు స్మార్ట్‌ఫోన్లలో వివిధ రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నారు. ప్రధానంగా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యాప్‌లతో పాటు న్యావీ, సూపర్ డాట్ మనీ, బిల్ డెస్క్ వంటి యాప్‌ల్లో కూడా ఆర్థిక లావాదేవీలు జరపవచు. అలాగే అయా యాప్‌ల కంపెనీ నిర్వాహకులు వ్యాపారస్తుల సౌకర్యార్థం దుకాణాదారులకు సౌండ్ సిస్టమ్ వచ్చే విధంగా బాక్సులు ఇస్తున్నారు. అలాగే యాప్స్ నిర్వాహకులు రోజువారి ట్రాన్స్‌సెక్షన్స్ బట్టి రుణాలు కూడా మంజూరు చేస్తుండడంతో వ్యాపారాలు క్యూఆర్ కోడ్‌ల వినియోగం మీద ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో వ్యాపారులకు చిల్లర గొడవ తప్పినట్టయ్యింది.

బ్యాంకులకు వెళ్లే పని తప్పింది..



గతంలో బైకులు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు రూ.వేల డబ్బులతో షోరూంకు వచ్చి నగదు చెల్లించి బైక్‌లను కొనుగోలు చేసేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారాయి. బైక్‌లు, స్పేర్స్ కొనుగోలు చేసే వినియోగదారులు ఫోన్‌ల లోని క్యూఆర్ కోడ్‌ల ద్వారా సులువైన పద్ధతిలో నగదు రహిత లావాదేవీలు చేసి బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. నగదు నేరుగా బ్యాంకులో జమ అవుతుండడం వలన మాకు రోజు వారిగా బ్యాంకులకు వెళ్లే పని తప్పింది.

– ఐనాల రాజీవ్, బజాజ్ బైక్ షోరూం, మేనేజర్, వైరా

మీ కోసం మేమున్నాం..



సత్తుపల్లి: అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, నాయకులు

సత్తుపల్లి: మా ఎన్నికల కోసం మీరు కష్టపడ్డారు.. ఇప్పుడు మా వంతు వచ్చింది.. మీ ఎన్నికల కోసం మేము ఉన్నాం.. విజయం మనదే.. అని టీపీసీసీ జనరల్ సెక్రటరీ, ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం సత్తుపల్లి పట్టణంలోని పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు అధ్యక్షతన జరిగిన సత్తుపల్లి మండల, పట్టణ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యేతో పాటుగా డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను ప్రతీ ఇంటింకి వెళ్లి వివరించాలన్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసుకొని ముందుండాలన్నారు. ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లను ఇస్తుందని, శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సూతి సత్యనాయణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌజన్య, సౌజన్యగౌడ్, బొందయ్య, ఆనంద్, శివవేణు, శ్రీనివాస్, కమల్‌పాషా, సాయికుమార్, నర్సింహారావు, కృష్ణయ్య, కుమారి, రాంబాబు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి..

వేంసూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని.. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, రాష్ట్ర నాయకుడు మట్టా దయనంద్ తెలిపారు. సోమవారం మండలంలోని మొద్దులగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల్లో అభ్యర్థుల ఎన్నిక విషయంలో తాము జోక్యం చేసుకోమని, గ్రామస్థాయి నాయకులే మంచి వ్యక్తిని ఎన్నుకోని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వరరావు, పీసీసీ మెంబర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



మొక్క నాటుతున్న ఉద్యానవన, వ్యవసాయ అధికారులు, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్

మధిర: ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకంగా ఉటుందని ఉద్యాన అధికారి విష్ణు అన్నారు. సోమవారం మండలంలోని సిద్ధినేనిగూడెంలో రైతు సూరంశెట్టి కిషోర్ తన వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో మధిర ఉద్యానవన అధికారితోపాటు వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యానవన అధికారి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ ఒకసారి నాటితే 30ఏళ్ల వరకు ఆదాయాన్ని ఇస్తుందన్నారు. కోతుల నుంచి ప్రకృతి వైపరీత్యాల నుంచి హానీ ఉండదని, చీడపీడలు కూడా తక్కువగా ఆశించడంతోపాటు మంచి మార్కెటింగ్ సౌకరయం ఉన్న పంట అని వివరించారు. ప్రభుత్వం రూ.200 విలువ గల మొక్కని రాయితీ మీద రూ.20కి ఇవ్వడంతో పాటు 4 సంవత్సరాల పాటు నిర్వహణ ఖర్చుల కింద ప్రతి సంవత్సరం ఎకరాకు రూ.4,200 చొప్పున ఇస్తుందని తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పలువురు నాయకులు తెలిపారు. అఖిలపక్ష ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి.. జీఓ 282 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, కార్మికులు.. అధికారులకు సమ్మె నోటీస్ అందించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, వారి శ్రమను కార్పొరేట్లకు దోచిపెడుతున్నాయని ఆరోపించారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు



వైరా: మాట్లాడుతున్న సీపీఎం కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, పక్కన నాయకులు



కల్లూరు: మాట్లాడుతున్న సత్యనారాయణ రెడ్డి

దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా సంఘటితం

కల్లూరు: దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా సంఘటితంగా ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక సంఘాల సమావేశంలో వేము రాంబాబు, సీపీఐ మండల కార్యదర్శి దయాకర్‌లు మాట్లాడారు. ఎంఈఓ పత్తిపాటి నివేదితకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం సీపీఐ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సీపీఐ కల్లూరు మండల కార్యదర్శిగా దామాల దయాకర్‌రావుతో పాటుగా పదిమంది కార్యదర్గ సభ్యులును ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా వేము రాంబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మున్సిపాలిటి కార్మిక నాయకులు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, మారేష్, అంజలి, రాధా, రఘు, జగదీష్, పంచాయతీ కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేసిన వెంకట్రామిరెడ్డి

సత్తుపల్లిరూరల్: గంగారం గ్రామాన్ని మాజీ వైస్ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన) అభివృద్ధి పథంలో నడిపారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సోమవారం ఆయన జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ సభ్యులు కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆర్థికసాయం చేయడంతో పాటు స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి అందరి ఆదరణ పొందారన్నారు. గంగారం చుట్టుపక్కల గ్రామాల్లో గల వివిధ ఆలయాలు, చర్చిలను సొంత ఖర్చులతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో చెన్నకేశవరావు, అప్పారావు, మారేష్, వాసుదేవరావు, జగదీష్, సుభాని, జవహర్‌లాల్, మోహన్‌రావు, మహేష్, మనోజ్, పోలయ్య, సత్యం, చిన్నమారేష్, నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం



గేటురేలకాయలపల్లిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: ఇందిరమ్మ రాజ్యంలోనే.. పేదలకు న్యాయం జరుగుతుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం కారేపల్లి మండలంలో గేటు రేలకాయలపల్లి, తవిసిబోడు, జైత్రాంతండా గ్రామాల్లో ఆయన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం కారేపల్లిలోని శ్రీలక్ష్మి కోటెక్స్ జిన్నింగ్ మిల్లు ప్రాంగణంలో మండల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని, అధికారులు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ, బిల్లులు త్వరగా అయ్యేటట్లు వారికి సహకరించాలన్నారు. సీజనల్ వ్యాధులపై గ్రామ కార్యదర్శులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీఓ రవీంద్రప్రసాద్, వైద్యాధికారి సురేష్, గ్రామ కార్యదర్శులు, హెల్త్ సూపర్‌వైజర్లు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహ నిర్మాణాలు పరిశీలన

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, కల్లూరు మార్కెట్ చైర్మన్ భాగం నీరజదేవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు పెరగకముందే నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లేల్ల భాస్కర్‌రెడ్డి సమకూర్చిన బ్యాగ్‌లు, ప్లేట్లు, పలకలను అందజేశారు. కాగా, నాయకులు గ్రామానికి వెళ్లే సమయాన మార్గమధ్యలో వరి నాట్లు వేస్తున్న కూలీలతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ పథకాల అందుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. అనంతరం కూలీలతో కలిసి నాయకులు భోజనం చేశారు. నాయకులు సత్యంబాబు, నర్సింహారావు, మాధవ్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భద్రుతండాలో..

ఏన్కూరు: మండలంలోని భద్రుతండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాంబాబు సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఇంటి నిర్మాణంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనర్హులు ఉంటే జాబితా నుండి పేర్లు తొలగించలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీఎస్ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

వేంసూరు: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం అమ్మపేరుతో మొక్క కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేంసూరు, అడసర్లపాడు, దుద్దెపూడి, కల్లురుగూడెం గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షులు దుపటి వంశి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పర్స రాంబాబు, మట్టా ప్రసాద్, ఉబ్బాల కృష్ణ, కిన్నెర మహేష్, మాడూరి రఘునాధరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఏన్కూరు: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జెండా ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకులను పార్టీలకతీతంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ ఏబీసీడీ వర్గీకరణ స్థాపించబడిన తరువాత ఎన్నో ఉద్యమాలకు వేదికగా మారిందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేందర్

ఎర్రుపాలెం: నిబంధనలకు ప్రకారం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మణాలు నిర్మించాలని ఎంపీడీఓ బి.సురేందర్, తహసీల్దార్ ఉషాశారద తెలిపారు. సోమవారం మండలకేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని, ప్రభుత్వం విడతల వారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులను జమ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ సెక్రటరీ ఏలేశ్వరరావు తదితరులున్నారు.

సన్మానం..



డాక్టర్ భాస్కర్‌నాయక్‌ను సన్మానిస్తున్న వైద్యులు

సత్తుపల్లిటౌన్: వైద్య, ఆరోగ్య శాఖలో విశేష సేవలు అందించిన డాక్టర్ భాస్కర్‌నాయక్ సేవలు అభినందనీయమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల భద్రాద్రికొత్తగూడెం డీఎంఅండ్‌హెచ్‌ఓగా ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ భాస్కర్‌నాయక్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్లు రామలక్ష్మి, రాధాకృష్ణ, హెచ్ఎస్‌లు హైమావతి, శారద, నర్సింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

మండలంలో పలు గ్రామాల్లో తొమ్మిది రోజులు పాటు నిర్వహించిన మొహర్రం వేడుకలు సోమవారం సాయంత్రంతో ముగిసాయి. మేళతాళాల నడుమ గ్రామాల్లో పీరీలను ఊరేగింపుగా ప్రదర్శన నిర్వహించగా.. గ్రామ ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని మతసామరస్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్త కుమారులు హసేన్, హుసేన్ చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొణిజర్ల: పల్లిపాడులో పీరీలు ఊరేగిస్తున్న ముస్లింలు



ముదిగొండలో..

లక్ష్యం ఘనం.. మొక్కలు శూన్యం

వన మహోత్సవానికి సమీపిస్తున్న అదును

సత్తుపల్లిటౌన్: పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణా ప్రభుత్వం వనమహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఏటా ఈ కార్యక్రమాన్ని ఉత్సవంలా ఊరూరా.. వాడవాడలా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సత్తుపల్లి మున్సిపాలిటీలో 1.07 లక్షల మొక్కలు వనమహోత్సవంలో నాటాలని ఘనమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటికే వర్షాలు కురిసి పుడమి చల్లబడింది. కానీ వన మహోత్సవానికి అవసరమైన మొక్కలు కనిపించని పరిస్థితి. ప్రణాళిక లోపించి ముందస్తుగా నర్సరీలను ఏర్పాటు చేయకపోవటంతో మొక్కలు పెరగలేదు. వనమహోత్సవంలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేసుకోవాలని అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో కావాల్సిన మొక్కలు అందుబాటులో లేవు. దీంతో వనమహోత్సవానికి అడ్డంకులు ఎదురౌతున్నాయి.

ఇంటికి ఐదు మొక్కలు చొప్పున..

పట్టణంలో ప్రతి ఇంటికీ ఐదు మొక్కలు చొప్పున పంపిణీ చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. స్థానికంగా ఉండే స్వయం సహాయక సంఘాలకు మొక్కలు పంపిణీ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇళ్లల్లోకి గులాబి, మల్లే, జాజిమల్లే వంటి పూలమొక్కలతో పాటు జామ, దానిమ్మ పండ్ల మొక్కలు అందించనున్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా కాకర్లపల్లిరోడ్, అశ్వారావుపేటరోడ్, వేంసూరురోడ్, అవని వెంచర్ మలుపు నుంచి కాకర్లపల్లిరోడ్ వరకు, వేశ్యాకాంతల చెరువు, తామరచెరువు కట్టలు, అంతర్గత రహదారులతో పాటు 35 ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు. వీటిలో బాదం, కదంబ, వేప, రావి, ఆకాశమల్లే, జెట్రోపా, గుల్‌మహారా, బోగన్ విలియా, పులిచర్మం మొక్కలు నాటనున్నారు.



ఖాళీగా ఉన్న నర్సరీ

లక్ష్యానికి అనుగుణంగా..



మున్సిపాలిటీలో లక్ష్యానికి అను గుణంగా అవసరయ్యే మొక్కలను ఇతర నర్సరీల నుంచి తెప్పించి నాటేందుకు చర్యలు చేపట్టాం. విద్యుత్ తీగల కింద నాటకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ఇళ్లల్లో పూలు, పండ్ల మొక్కలను నాటి సంరక్షించాలి. అవెన్యూప్లాంటేషన్‌లో కూడా ఆహ్లాదకరంగా ఉండేలా పూలు, ఇతర మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కె.నర్సింహ, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి